
# డియర్, గుర్తుందా?

—చందు సోంబాబు



చేతికర్రని గట్టిగా పట్టుకుని చెక్కబల్ల పైన కూర్చున్నారు రావుగారు. పక్కనే ఉన్న బ్రీఫ్‌కేస్‌ని చేత్తో తడిమి చూసుకున్నారు.

కళ్లు చిట్లించి ప్లాటుఫారంమీద వెలుగుతూన్న దీపపు కాంతిలో చేతి గడియారంకేసి చూసుకున్నారు రావుగారు.

పదయింది.

రావలసిన రైలు గంట లేటు -అప్పటికే. ప్లాటుఫారంమీద జనం రైలు కోసం ఎదురుచూస్తున్నారు.

వెళ్లేవారిని సాగనంపడాని కొచ్చిన వాళ్లూ, వెళ్లేవారూ, తోచక చల్లగాలి కోసం అక్కడికొచ్చినవాళ్లూ- రాత్రి పదయినా అక్కడ సందడిగానే ఉంది.

ఎక్కడో గంటలు కొట్టినట్టు శబ్దం వినబడి, ఉలిక్కిపడ్డారు రావుగారు.

ఆయన పెదవులపైన చిన్న నవ్వు వెలిసింది. ఆ నవ్వులో ఈ ప్రపంచాన్ని ఆసాంతం చదివేసానన్న ఫిలాసఫీ కనబడుతోంది.

మనిషి బ్రతుకెంత చిత్రమైంది!

మమతలు.... ప్రేమలు.... అనుబంధాలు– వాటిని కాదనలేకా, తెంచుకోలేకా మనిషి పడే ఆరాటం, ఆవేదనా... బహు చిత్రం కదా!

కానీ ఆయన అన్నింటికీ అతీతుడు. ఆయనకి ఏ విధమైన బంధాలు లేవు, నా అన్నవాళ్లు కూడా లేరు.

ముప్ఫైఅయిదేళ్ల క్రితమే ఆయన ఒంటరి జీవితానికి అలవాటుపడిపోయారు.

ప్లాటుఫారంమీద జువ్విచెట్టుమించి

గలగలమని ఆకుల శబ్దంతోపాటుగా చల్లని గాలితెమ్మెరలు వీస్తున్నాయి.

రవంత చలిగానే ఉంది.

అరవై ఏళ్ల వయసుగల ఆయన శరీరానికి ఆ గాలిని తట్టుకోవడం కష్టంగానే ఉంది.

కండువాతో ఒంటిని కప్పుకున్నారు.

రావుగారి అసలు పేరు ప్రసాదరావు. తాలూకాఫీసులో గుమాస్తాగా చేరి, ఆఖరికి తాసిల్దారు చేసి రిటైరయారు.

నిప్పులా బతకడం ఆయనకి మొదటి నించీ అలవాటు. సర్వీసులోనూ నిప్పుగానే మాట పొందాడు. చేతనైన సాయం ఏ ఊళ్లో పనిచేస్తే ఆ ఊరి ప్రజలకి చేసారు.

పైసా ఎవర్నించీ ఆశించలేదు. కేవలం జీతం డబ్బుతో జాగ్రత్తగా కాలక్షేపం చేశారు.

సొంత ఇల్లు కట్టుకున్నారు. కాస్తో కూస్తో బాంకు అకౌంటు ఉంది. పెన్షన్ కమ్యూట్ చేసిన డబ్బుకూడా బాంకులోనే ఉంది. ఇంటిని అద్దెకిచ్చి ఓ రెండు గదులు తను వాడుకుంటున్నారు.

ఇదివరలో లేదుగానీ ఇప్పుడు జీవితం అంటే విసుగ్గా ఉంది.

కంటిచూపు తగ్గింది. కళ్లజోడు ఉన్నా, దాని ఉపయోగం అంతగా ఉందనిపించడంలేదు. శరీరంలో కూడా దారుఢ్యం తగ్గింది.

జేబులోంచి చార్మినార్ సిగరెట్ పెట్టిని తీసి ఓ సిగరెట్ వెలిగించారు.

ఇవి తనకి చివరి రోజులని రావుగారికి బాగా తెలుసు. అందుకే ఓసారి దేవుడ్ని దర్శించాలని తిరపతికి వెళ్లారు. అక్కడ్నించి తనతోపాటే పనిచేసిన మిత్రుడు వెంకటస్వామి చనిపోయాడని తెలిసి, అతని భార్యని పలకరించి తిరుగు ప్రయాణమయారు.

రైలు రెండుగంటలు లేటు! మరో గంటకిగానీ రాదని ఎవరో అంటుంటే విన్నారాయన.

ఒంటరితనం ఎంత నరకమో ఇప్పుడిప్పుడే తెలుస్తోందాయనకి.

ఒకవేళ తను మరణిస్తే, మోసుకు పోవడానికి నలుగురు మనుషులైనా వస్తారా?

ఆయనకి దుఃఖం ముంచుకొచ్చింది. భయంతో కాదు— గుండె లోతుల్లోంచి బయటకి ఎగసిపడుతోన్న గుబులు అది.

"తనదీ ఓ బతుకేనా?" అసహ్యం వేసింది.

ఒంటరిగా, దిక్కులేనివాడిలా గుండె గుబులు పుట్టిస్తుంటే, కళ్ళలో నీరు సుడులు తిరుగుతోంది. ఓదార్చేదెవరు? ఆయన ఉనికి ఎవరి కవసరం?

'జానకీ....' ఆయన గుండె నీరసంగా మూలిగింది.

తను సంపాదించిన ఆస్తికన్న పదిలంగా ఆయన ఆ మూడు అక్షరాలనీ గుండెల్లో పదిలపరుచుకున్నారు ఇన్నేళ్ళగాను.

'జానకీ! ఎక్కడున్నావ్? నా ఊపిరి పోయేలోగా నిన్నొక్కసారి చూడగలనా?' గొణుగుతున్నట్టుగా అనుకున్నారు రావుగారు.

జానకితో రెండేళ్ళ స్నేహం ఆయనది. అదిప్పటిది కాదు— ముప్ఫైయిదేళ్ళ క్రితం ఆమెతో గడిపిన రెండు సంవత్సరాలు— ఆమె చుట్టూ అల్లుకుపోయిన ఆయన మనసు— అప్పటికీ ఇప్పటికీ చెక్కుచెదరలేదు.

ప్రేమంటే ఏమిటో, దానికున్న శక్తి ఎలాంటిదో, అది మనిషి నెంతగా ఉత్తేజపరుస్తుందో, మరెంతగా చంపేస్తుందో పూర్తిగా తెలుసుకున్నరోజులవి.

జానకి తనతోనే ఇంటర్ చదివింది.

అప్పుడే జానకితో పరిచయం. జానకికి ఎకనామిక్స్ కోచ్ చేసేవారాయన. జానకి కోసం ఆమె ఇంటికి వెళ్లేవారు. జానకి ఇంట్లో ఎవరికీ అందుకు అభ్యంతరం ఉండేది కాదు.

రెండేళ్ళ ఆ స్నేహం ఎంతో మధురంగా గడిచిపోయింది. జానకితో సంచరించిన ఆ రెండేళ్ళ కాలంలోని ఏ ఒక్క క్షణాన్నీ మరిచిపోలేదు.

అప్పటికీ, ఇప్పటికీ ఆమె ఆయన గుండెల్లో జీవించే ఉంది. ఆమెపట్ల ఆరాధనతో జీవితాన్ని ఒంటరిగానే మిగుల్చుకున్నారు.

జానకితో జీవితాన్ని పంచుకోవాలనీ, ఆమెతో కలిసి జీవితమంతా ఉండాలని ఎన్ని కలలు కనలేదు కనక?

ఆ కలలు నిజం కాలేదు.

కలలు అల్లా తేలిపోయినాయి. జానకీ, తనూ ప్రేమించుకున్నట్టు తెలిసి, ఆమె తండ్రి ఆమెని కట్టుదిట్టం చేశాడు. నెల తిరగందే ఆమెకి పెళ్ళి చేసేశాడు.

చాలా ప్రేమకథల కథే ముగింపు. చదువుకోవడానికి పాతగానే ఉంటుంది. కానీ ఆ ప్రేమ భగ్నమై జీవితం ఎడారి అయిన మనిషికి అదో మధురమైన వేదన!

ఆమె ఇంట్లో పెళ్లిబాజాలు మోగుతూంటే, తన ఇంటిముందు చావుమేళం మోగిస్తున్నట్టనిపించింది. దూరం నించైనా ఆమె పెళ్లిని చూడాలనా రోజు తహతహలాడింది మనసు. కానీ పదునైన కత్తితో గుండె నెవరో ముక్కలుగా తరుగుతూన్నట్టు, నిరాశ,నిస్పృహ తనని చంపేసిన ఆ తరుణాన్ని ఇప్పటికీ మరచిపోలేదు రావుగారు.

జానకిని ప్రేమించటమే కాదు, ఆమెని తన గుండెల్లో పదిలంగా దాచుకున్నారు.

అందుకే తన ఉనికివల్ల జానకి జీవితంలో చీకటి తెరలు కమ్ముకోరాదని ఆనాడే నిశ్చయించుకున్నారు.

జానకి పెళ్ళయాక, ఆఖరిసారిగా

ఆమెని అత్తవారింటికి వెళ్లేటప్పుడు రైలుస్టేషన్లో, దూరంగా నిలబడి చూశాడు. కన్నీళ్ళతోనే వీడ్కోలు చెప్పాడు.

జానకి కళ్లు ఆనాడు ప్లాటుఫారాన్ని తనకోసం ఎలా గాలించిందీ ఈనాటికీ ఆయనకి గుర్తే!

రైలు కదిలేక, వెళ్లిపోతూన్న రైల్లోంచి తనని చూసి కన్నీళ్ళతో చేయి ఊపిన జానకి!— ఇప్పటికీ ఆ దృశ్యం కలచివేస్తుంది రావుగారిని.

అనాడనిపించింది— ఇంకా ఈ బతుకెందుకు? ఆ రైలుకిందే పడి ఆత్మహత్య చేసుకోవాలని.

'ప్రేమ' అన్న మాట కేవలం రెండు అక్షరాల కలయిక. కానీ అది రెండు మనసుల మధ్య ఎంత తీయనైన అనుభూతిని రేకెత్తిస్తుందో, మరెంత మధురమైన ఆత్మీయతని, అనురాగాన్ని, అనుబంధాన్ని అల్లివేస్తుందో ఎవరికైనా చెబితే నవ్వుగా ఉండచ్చు. అందుకే ప్రేమించిన ఏ మనిషీ కూడా తన ప్రేమకథని ఎవరితోనూచెప్పుకోకూడదు; ఆ ప్రేమని నవ్వులపాలు చేయకూడదు.

రావుగారు అందుకే తన ప్రేమకథని ఆయన గుండెల్లోనే దాచుకున్నారు. జానకి గుర్తుగా ఒంటరిగానూ, బ్రహ్మచారిగానూ జీవితాన్ని ఈదుకొచ్చారు.

అనాటినుంచి ఈనాటివరకూ జానకిని ఆయన మళ్లీ కళ్లతో చూడలేదు. ఏ ఊళ్లో ఉందో, ఎలా ఉన్నదో కూడా తెలీదు. పై కండువాతో కళ్లొత్తుకున్నారు.

ప్లాటుఫారంమీద గంట మోగింది. దూరంగా రైలొస్తున్నట్టుగా డీజిల్ ఇంజన్ హారను వినబడింది.

రావుగారు లేచి నిలబడ్డారు. తడబడుతున్న నడకతో ముందుకు నడిచారు.

రైలు ఆగింది.

తనకి 'సి' కోచ్‌లో బెర్తు ఉంది. 'సి' కోచ్‌వైపు నడిచారు.

రైలెందుచేతనో ఆరోజంత రద్దీగా లేదుకూడా. కంపార్టుమెంటులో కెక్కి తన బెర్తుపైన కూర్చున్నారు. కిటికీలోంచి బయటికి చూస్తూ, ఆలోచనా సముద్రంలో మునిగిపోయారు.

ఎవరి బెర్తులపైన వాళ్లు పక్కలు పరుచుకుని పడుకుంటున్నారు.

టి.టి.ఇ. వచ్చి టికెట్ చూసి, సంతకంచేసి వెళ్లిపోయాడు. రైలు కదిలింది. రెండున్నర గంటల వ్యవధిని, దూరాన్ని కోల్పోయిన రైలు వేగాన్ని పుంజుకోడానికి అవస్థపడుతోంది.

"మీరు పడుకుంటారా? నేను కూడా బెర్త్ ఎక్కేస్తాను" ఎవరో రావుగార్ని అడిగారు.

"మీది?"

"మిడిల్ బెర్త్" చెప్పాడతను.

రావుగారు లేచారు. అతను బెర్త్‌ని పైకి లేపి, గొలుసులు తగిలించి పైకెక్కి పడుకున్నాడు. అప్పర్ బెర్త్ పైన కూడా ఎవరో పడుకున్నారు.

ఎదురుగా మిడిల్, అప్పర్ బెర్త్‌ల పైన కూడా పడుకున్నారు. లోయర్ బెర్త్ మాత్రం కాళీగానే ఉంది.

మిడిల్ బెర్త్‌పైన ఎక్కినతను లైటు తీసేశాడు.

కంపార్టుమెంటు మసక చీకటితో నిండిపోయింది.

రావుగారు ఉస్సురని నిట్టూర్పు విడిచి నడుం వాల్చారు.

పడుకోవాలని పడుకోవడమే తప్ప నిద్రపట్టదని ఆయనకి తెలుసు. రాత్రిళ్ల త్వరగా నిద్రపట్టదు. తెల్లారగట్ట తొందరగా మెలకువ వచ్చేస్తుంది. అది నిజానికి ఆ వయసు లక్షణం.

కానీ అది రావుగారి విషయంలో మాత్రం కాదు.

సుఖమైన నిద్ర ఆయనకి చాలా సంవత్సరాల క్రితం జానకితో పాటే దూరం అయింది.

ఇన్నాళ్లూ ఎలా బ్రతికినట్టు?

బ్రతకాలని బ్రతకలేదు.

బ్రతకలేక బ్రతికారు.

గవర్నమెంటువారిచ్చిన కుర్చీకి అతుక్కుపోయి, ఓ యంత్రంలా గడిపారు. ఇప్పుడా కుర్చీ దూరమైకూడా చాలా రోజులయింది. ఎవరికీ ఏ విధంగానూ కాని ఒంటరి బ్రతుకు.

తనువు చాలిస్తే— ఆ చోటుని భూమాత మరో ప్రాణికి కేటాయిస్తుంది.

కానీ.... ఆ అదృష్టం కూడా కానరావడం లేదు.

మృత్యుదేవత కౌగిలికి కూడా తను అనర్హుడా?

రైలు కుదుపుతూ పరుగులు తీస్తోంది. రైలుబండి శబ్దం లయబద్ధంగా వినిపిస్తోంది. ఆ శబ్దంలోనుండి ఎన్నో.... ఎన్నో రకాల మోతలు.... రావుగారి ఆలోచనల్లోని 'జానకి' అన్న మూడు అక్షరాల పిలుపుని రైలు శబ్దంలో.... ఆ హోరులో.... జానకి.... జానకి.... జానకి.... జానకి.... జాన.... జా.... జ....

ఇప్పుడా శబ్దం మధురంగా, సంగీతంలా వినబడుతోంది.

కళ్ళు మూసుకున్నాడు.

జానకి ఇప్పు డెలా ఉందో? అనాటి జానకి....

అప్పుడే పూసిన గులాబీలా ఉండేది. ఆమె మనసులాగే మనిషి కూడా ఎంతో నాజూకుగా ఉండేది. కోమలమైన ఆమె మాటలు సంగీతంలా వినబడేవి. ఆమె నల్లని కళ్ళలో ఏం ఆయాస్కాంతాలుండేవో కానీ అడుగు కదలనిచ్చేదికాదు.

ఇప్పుడు జానకి ఎలా ఉందో?

వయసు పైబడి ఆమెకూడా తనలాగే....

ఆమె నలా ఊహించుకోలేకపోయాడాయన.

అలనాటి జానకి....

ఒకనాటి తన ప్రేయసి....

అదే ఆకృతిలో - ఆ ముసలి వయసులో కూడా ఆయన మదిలో కదులుతోంది: ఆయన్ని చావనీయకుండా బతికిస్తోంది.

కళ్ళు విప్పలేని .... మైకం కమ్ముకొస్తోంది. కానీ తృప్తిగా ఓనవ్వు కదులుతోంది ఆ ముఖంలో....

రైలుబండి గట్టిగా కూస్తూ ధనధన మని వెళుతోంది.

- సమయం ఎంత గడిచిందో తెలియదు. కళ్లువిప్పి చూశాడు రావుగారు.

రైలు ఆగిఉంది.

బద్ధకంగా లేచి కూర్చున్నారు. కిటికీలోంచి బయటికి తొంగిచూశారు.

కాజీపేట జంక్షన్ -

అంటే మరి కొంతసేపు ఆగుతుంది రైలు.

బెర్తుమీద తలొంచి కాస్త ముందుకు జరిగి కూర్చున్నారు. జేబులోంచి సిగరెట్ పెట్టె తీసి సిగరెట్ వెలిగించారు. గుప్పుమని పొగవదిలి చేతి గడియారంకేసి కిటికీగుండా కంపార్టుమెంటులోకి పడుతున్న వెలుగులో చూశారు.

మూడున్నరయింది.

రైలు కదిలితే హైదరాబాదుకి మరో మూడుగంటల ప్రయాణం.

ప్లాటుఫారం మీద ఏవో మాటలు వినబడుతున్నాయి.

"ఖాళీ గుంటే ఓ బెర్తు ఇవ్వండి" ఎవరో స్త్రీ అడుగుతోంది.

"ఎక్కడికి?" టి.టి.ఇ. ప్రశ్న.


"హైదరాబాదు."

"ఎక్కండి."

పోర్టరు సామానుతో కంపార్టుమెంటులోకి ఎక్కాడు. ఆమెకూడా ఎక్కి లోపలకొచ్చి రావుగారి కెదురుగా ఖాళీగా ఉన్న బెర్తుపైన కూర్చుని....

"ఇది ఖాళీయేగా!" అడిగింది.

"ఆఁ" ముక్తసరిగా సమాధానం



చెప్పారు.

ఆమె భారంగా ఊపిరి తీసుకుని, చేతిగుడ్డని విప్పి పోర్టరుకి డబ్బులిచ్చి పంపేసింది.

మళ్ళీ రైలు కదిలింది. టి. టి. ఇ. వచ్చి ఆమెదగ్గర బెర్తు చార్జీ తీసుకుని వెళ్ళిపోయాడు.

చేతిలో సిగరెట్ పీకని అవతలపడేసి, తిరిగి పడుకున్నారు రావుగారు. అప్పుడే రైలు ఎక్కినావిడ కూడా బెర్తుపైన దుప్పటి పరచుకొని పడుకుంటోంది.

- ఏవో కేకలు విని కళ్లువిప్పి చూశారు రావుగారు. సికింద్రాబాదు స్టేషన్లో ఆగిఉంది రైలు.

రైలు చాలావరకు ఖాళీ అయిపోయింది. కాజీపేటలో ఎక్కినావిడ మాత్రం కిటికీలోంచి బయటికి చూస్తోంది.

మిడిల్ బెర్తుని కిందికి దించి, సర్దుకొని కిటికీ పక్కగా కూర్చున్నారు రావుగారు.

అప్పుడే అటు తిరిగిన.... ఆమెకేసి నిర్ఘాంతపోతూ చూశారు రావుగారు.

ఆమె జానకి.

తన జానకి.

వెంటనే నోటమాట రాలేదాయనకి. అపరిచిత వ్యక్తి తననలా చూడ్డం ఇబ్బందిగా అనిపించినట్టుంది ఆమెకి. మొహం తిప్పుకొని కూర్చుంది.

రావుగారు మరోమారు చూశారు ఆమెకేసి.

జుత్తు నెరిసిపోయింది. కళ్లకింద నల్ల చారలు.... నుదుట బొట్టు లేదు. ఆమెలో చాలా మార్పు వచ్చింది. అయినా రావుగారి కళ్లుఆమెని గుర్తుపడుతున్నాయి.

"జానకీ..." ఆ పిలుపెలా వచ్చిందో తెలీదు.

ఆమె ఆయనకేసి చూసింది. కానీ గుర్తుపట్టినట్టు లేదు.

"జానకీ! నువ్వు నా జానకివి. నువ్వు లక్షమందిలో ఉన్నా నా కళ్లు గుర్తుపడతాయి. నువ్వు నన్ను గుర్తుపట్టలేదా జానకీ?" రావుగారు మెరుస్తున్న కళ్లతో అడిగారు.

ఆమె విస్మయంగా చూసింది.

"మీరు.... మీరు.... ప్రసాద్.... నువ్వా!" అంది.

"అవును జానీ! నేనే, నీ ప్రసాదాన్ని" ఆయన కళ్లలో నీరు తిరిగింది.

జానకి కళ్లలోనూ నీరు తిరిగింది.

"ఇంతదూరం కలిసి ప్రయాణం చేసినా, ఒకరినొకరు గమనించనేలేదు. నిన్ను మళ్లీ ఇన్నాళ్లకి చూస్తానని కలలో కూడా అనుకోలేదు జానీ" అన్నారు రావుగారు.

'జానీ' అని ఆయన పిలుస్తూంటే ఆ వయసులో ఆమె కన్నెపిల్లలా సిగ్గు పడింది.

"జానీ.... ఆయన?" అడిగారు.

"పోయారు. అయిదేళ్లయింది."

"అయ్యో! పిల్లలు...."

"ముగ్గురమ్మాయిలు, ఒక అబ్బాయి. అందరికీ పెళ్లిళ్లు అయిపోయినాయి. కోడలికి పురుడు. అందుకొస్తున్నాను" అంది.

"అన్ని బాధ్యతలూ తీరిపోయాయి అన్నమాట."

వాళ్ల మాటల్లో రైలు కదిలినది కూడా గమనించలేదు.

"అలా! నీ భార్యా, పిల్లలు...." అడిగింది జానకి.

ఆ ప్రశ్నకి రావుగారి ముసలి మొహంలో ఓ చిన్న నవ్వు తొణికిసలాడింది.

"నేను పెళ్లిచేసుకోలేదు జానీ, నీ గుర్తుగా నే నిలాగే మిగిలిపోయాను. నేను ఒంటరివాడిని" అన్నారు.

ఆయన మాటలకి ఆమె కళ్లలో నీరు తిరిగింది. కానీ తనకోసం, తనకో ప్రత్యేకతని సంతరించిపెడుతూ, తన ప్రేమకోసం జీవితాన్ని అంకితంచేసిన రావుని చూస్తూంటే ఆమెకి గర్వం కలిగింది.

ముప్పైఏళ్లు సంసారం చేసిన భర్త ఏనాడూ తనని అర్థంచేసుకున్నట్టు గానీ, తనకో ప్రత్యేకతని గానీ ఇవ్వలేదు. కానీ రెండే రెండేళ్ల స్నేహంలో, ప్రేమతో తననింతగా ఆరాధించే ఈ మనిషిని ఎన్ని మాటలన్నారు? కులం తక్కువ మనిషి అన్నారు. పెడబుద్ధి గలవాడన్నారు.

అవన్నీ అబద్ధాలు! ప్రేమకి కావల్సింది కులం కాదు: మనసు ప్రధానమని ప్రతి మనిషీ తెలుసుకోవాలి. ఆడదానికి అలాంటి మగాడి అండ దొరికితే అంతకంటే జీవితంలో ఏం కావాలి?

రావుగారికి జానకిని దగ్గరగా తీసుకుని తడివి చూసుకోవాలని ఉంది.

"జానీ! నీకు గుర్తుందా" అడిగారు.

"ఊఁ" అంది. ఏమిటి? అని అడగలేదు.

ఆ రోజు__

"ఈ వేళ నా పుట్టినరోజు. నువ్వేదో మంచి బహుమతిని తెస్తావనుకున్నాను." అంది జానకి.

"తేలేదని ఎందుకనుకున్నావు? నువ్వు తీసుకుంటావో లేదో అని భయపడుతున్నాను" అన్నాడు ప్రసాదరావు.

"ఆ భయం ఏమీ అక్కర్లేదు: ఇచ్చెయ్" అంది జానకి.

"అయితే కళ్లుమూసుకో!" అన్నాడు.

జానకి కళ్లు మూసుకుని "ఊఁ? ఇవ్వు మరి" అంది.

ప్రసాదరావు చిరునవ్వుతో ముందుకు అడుగేసి, ఆమె మొహాన్ని చేతుల్లోకి తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు.

"ఏమిటిది?" చిరుకోపంతో అడిగింది జానకి.

"బహుమతి జానీ, ఇది మన ప్రేమకి తొలికానుక. ఇది మొదటి ముద్దు జానకీ; ఇందులో నా ప్రాణం ఉంది" అన్నాడు ప్రసాదరావు.

"థాంక్స్ ప్రసాద్! ఈ కానుకని నా పెదవుల్లో పదిలపరుస్తాను" అంది జానకి.

———

ఇద్దరూ ఒకరికేసి ఒకరు చూసుకున్నారు. జానకి సిగ్గుతో తల వంచుకుంది.

రైలు ఆగిన సంగతికూడా వాళ్లు గమనించలేదు.

ప్రసాదరావుగారు జానకికేసిచూశారు.

"జానకీ! నీ బాధ్యతలన్నీ తీరిపోయినాయి. నీకోసం ఇన్నేళ్లూ నిరీక్షిస్తూ ఒంటరిగా మిగిలిపోయాను. ఇప్పుడన్నా నీ తోడుని నాకు ప్రసాదించవా?" అని అడగాలనుకున్నారు. కానీ ఆ మాట అడగకముందే ఓ కుర్రాడు వచ్చాడు.

"దిగు మమ్మీ! స్టేషనొచ్చినా ఇంకా రైల్లోనే కూర్చున్నావు" అన్నాడు.

ఆ కుర్రాడిని జానకి కొడుకుగా గుర్తించారు రావుగారు. నిస్పృహతో ఏం మాట్లాడాలో తోచక జానకికేసి చూశారు.

జానకి ఓ సారి రావుగారికేసి చూసింది.

ఆ చూపులో ఎన్నో అర్థాలు గోచరించినాయి.

'ప్రసాదం! నా కన్ని బాధ్యతలూ తీరిపోయినాయి. నా ఆఖరి ఘడియలని నీ సన్నిధిలో గడపాలని ఉంది. కానీ.... కానీ.... నా పాతకథ నా పిల్లలకి, మనవలకి తెలిస్తే నా కెంత చిన్నతనం?.... నావాళ్లెంత బాధపడతారు?' అన్నట్టుగా అనిపించింది.

"వెళ్తాను" అంది రైలు దిగుతూ జానకి. రావుగారు కూడా దిగారు__

కొడుకుతోపాటే నడిచి వెళ్తోంది జానకి.

రావుగారు నిలబడలేకపోయారు. మరొక్కసారి జానకితో మాట్లాడాలనిపించింది.

గబగబ నడవబోయారు. కాళ్లు తడబడినాయి. అడుగులు పడడంలేదు.

"జానకీ" అని అరవాలనిపించింది. కానీ అది గొంతుదాటి రాలేదు.

గబగబ గేటులోంచి బయటకు వచ్చారు రావుగారు.

జానకి, ఆమె కొడుకూ ఎక్కిన ఆటో వెళ్లిపోతోంది.

ఇన్నేళ్ల తర్వాత కనబడింది, కనీసం ఎక్కడుంటుందో చెప్పలేదు. తనెక్కడుంటున్నాడో అంతకంటే అడగలేదు.

మళ్లీ జానకి జీవితంలో తటస్థపడుతుందా?

రావుగారి కళ్లలో నీరు చిప్పిల్లుతోంది.